క్లుప్తంగా

23న నాంచారమ్మ అమ్మవారి నెల సంబరం



కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల సంబరాన్ని ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ శనివారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర ముగిసి నెల రోజులు పూర్తి కావడంతో ఈ సంబరాన్ని జరపుతున్నట్లు చెప్పారు. 23వ తేదీ ఉదయం కొండవీటి వంశీయుల ప్రత్యేక పూజలనంతరం అమ్మవారికి మహిళలు నైవేద్యాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నాంచారమ్మ అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక అలంకారం నిర్వహించి, ఆ రోజు రాత్రి నెల సంబరాన్ని జరపనున్నట్లు ఈఓ చెప్పారు.

వెంకన్న ఆలయం.. శోభాయమానం



మచిలీపట్నం టౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా మారింది. స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దటంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడో రోజైన శనివారం ఆలయంలో వధూవరాన్వేషణ (ఎదుర్కోలు ఉత్సవం) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

సుదర్శన చక్రానికి అభిషేకం



అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో విమాన శిఖరం, సుదర్శన చక్రం ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆగమ పండితుడు నల్లూరి దాశరధి శ్రీనివాస దీక్షితులు బ్రహ్మత్వంలో విశ్వక్షేన పూజ, అగ్నిమధనం, జీవధ్వజములు కార్యక్రమం జరిగాయి. ఈ సందర్భంగా పలు రకాల ద్రవ్యాలతో విమాన శిఖరం, సుదర్శన చక్రానికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన కోలాట నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్త పోతురాజు భాస్కరరావు, గీతామందిరం ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి శ్రీహరిబాబు పర్యవేక్షించారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి



కొడాలి(ఘంటసాల): ఉపాధి జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతాక్రమంలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఏపీడీ రామ్మోహనరావు పేర్కొన్నారు. ఘంటసాల మండలం కొడాలి, చిట్టూర్పు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి, వారికి పనుల కల్పనపై ఆరాతీశారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించారు. పేదల జీవనోపాధి కోసం ఎంజీఎన్‌ఆర్జీఎస్ పనులు చేపట్టామన్నారు. ఈ పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండి పనులను సమర్థంగా చేయించాలని సూచించారు. అనంతరం ఆయా ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీఎం సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ బి.మారుతీ శేషమాంబ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రామ్మోహరరావు, ఏపీఓ రాజ్‌కుమార్, పలువురు ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వైఎస్సార్ సీపీ బందరు ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు



ఎస్ఎన్ గొల్లపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ బందరు ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు అన్నారు. మండలంలోని ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామంలో ఆయన శనివారం గడప గడపకు మన సంక్షేమం ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు ఇంటింటికీ తిరిగి జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో రైతుల కోసం లక్షా 75 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కేవలం రైతు భరోసా పథకం కింద వరుసగా ఐదో ఏడాది 53 లక్షల 53 వేల మంది రైతు కుటుంబాలకు రూ.2204.77 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. చంద్రబాబు పాలనలో రైతుల కోసం చేసిన అభివృద్ధి ఏమిటనేది ప్రజలే ఆలోచించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలోనూ 166 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు కొనుగోలు చేసి రైతులను అన్ని విధాల ఆదుకుందని వివరించారు. పాడి రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా లీటరుకు 10 నుంచి 22 రూపాయల ధర అదనంగా ఇస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రికి సంపూర్ణ మద్దతు ఇచ్చి అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ గొల్లపాలెం సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య, ఇతర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు



విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న బండేటి వెంకటరమణ

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీ ఆరో డివిజన్ ఇన్‌చార్జ్ బండేటి వెంకటరమణతో పాటు పలువురు నాయకులు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ వ్యవహార శైలి ఒంటెత్తు పోకడలా ఉందని విమర్శించారు. రామకృష్ణ తన వ్యవహారశైలిని మార్చుకోకుంటే రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తీవ్ర నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. బండేటి వెంకటరమణ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి రామకృష్ణపై విమర్శలు గుప్పించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో తాను ఆరో డివిజన్‌లో కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి చెందానని అప్పటి నుంచి డివిజన్ ఇన్‌చార్జ్‌గా తానే వ్యవహరిస్తున్నానని తెలిపారు. అయితే రామకృష్ణ ఇటీవల తనను ఇన్‌చార్జ్‌గా తప్పించి వేరే డివిజన్‌కు చెందిన వ్యక్తిని ఇక్కడ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నారు. తనకు సమాచారం ఇవ్వకుండానే ఈ మార్పు చేశారని, సాధారణ ఎన్నికల సమయంలో పార్టీ సీనియర్ నాయకుడినైన తనను తప్పించటంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన తనను బండి రామకృష్ణ ఏకపక్ష నిర్ణయంతో తొలగించడాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. రామకృష్ణ ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ భ్రష్టుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ బండి రామకృష్ణను తొలగించకపోతే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని పవన్‌కళ్యాణ్‌కు దండం పెట్టి మరీ వెంకటరమణ వేడుకున్నారు. తన అంశంపై పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంను బట్టి తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని వెంకటరమణ తెలిపారు. వెంకటరమణకు రాధా–రంగా మిత్ర మండలి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు మద్దతు తెలిపారు.

జనసేన రెబల్ అభ్యర్థి బాబు నామినేషన్ దాఖలు



పెడన: స్వాతంత్ర అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన సమ్మెట వెంకన్న బాబు రెబల్‌గా రెండు సెట్ల నామినేషన్లను దాఖలుచేశారు. ఆయన శనివారం ఉదయం పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట పెడన మండలం బల్లిపర్రు స్వగ్రామం నుంచి ర్యాలీగా పెడన ఈఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను ఈఆర్వో పి.వెంకటరమణకు అందజేశారు. స్థిర, చర ఆస్తులు సుమారు తనపేరుపైన రూ.31 లక్షలు, భార్య పేరుపైన రూ.4.50 లక్షలు ఉన్నట్లుగా అఫిడవిట్‌లో బాబు తెలిపారు. పెడన పీఎస్‌లో రెండు, మొబైల్ కోర్టులో ఒక కేసు ఉన్నట్లుగా పేర్కొన్నారు.

మూడో రోజు దాఖలవని నామినేషన్లు

అవనిగడ్డ: సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ శాసనసభ స్థానానికి సంబంధించి మూడో రోజైన శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. శుక్రవారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నాదెళ్ళ గిరిధర్‌నాయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకూ ఆ ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది.

అంధత్వ నివారణకు లయన్స్ క్లబ్ కృషి

చల్లపల్లి: ప్రపంచ వ్యాప్తంగా అంధత్వ నివారణ కోసం లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని చల్లపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కోమలా నగర్‌లోని క్లబ్ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వారిలో 12 మందికి కంటి శుక్లాలకు ఆపరేషన్ చేయాలని డాక్టర్ వెంకట్రావ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎ.ఎల్.ఆర్.కె.ప్రసాద్, కార్యదర్శి రాయపాటి రాధాకృష్ణ పర్యవేక్షించారు.

జగనన్నకు అండగా నిలవాలి

పూషడం(ఘంటసాల): ఎస్సీలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలుద్దామని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం పూషడం గ్రామంలో శనివారం రాత్రి వెంకటేశ్వరరావు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడి స్థానిక సమస్యలు, పరిష్కారంపై చర్చించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. పేదలకు అవసరమైన విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎస్సీల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలంటే జగనన్నకే సాధ్యమన్నారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గా వరప్రసాద్, కె.శ్రీనివాసరావు, అభిలాష్, కొడాలి కోటేశ్వరరావు, రమేష్, కె.రాజగోపాలరావు, వెంకటాపురం ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, కొమ్ముకూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



క్షీర, జలాధివాసాల్లో స్వామివార్ల విగ్రహాలు



ప్రతిష్ట హోమాల్లో పాల్గొన్న దంపతులు

బంటుమిల్లి: మండలంలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురంలో కోదండ రామాలయ ప్రతిష్ట మహోత్సవాలు మూడో రోజైన శనివారం వైభవంగా కొనసాగాయి. స్వామివార్ల విగ్రహాలకు పండితులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం పంచగవ్యారాధన, జల, క్షీర, ధాన్య తదితర ద్రవ్యాలతో అధివాసాలు, వాస్తు హోమాలు తదితర పూజలు నిర్వహించారు. పంట కాలువ నుంచి బిందెలతో నీరు తెచ్చేందుకు మహిళలు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్ట అనంతరం భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



మల్లంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ రంగనాథ్, డాక్టర్ సహజ, నిశ్చల తదితరులు

మల్లంపల్లి(ఘంటసాల): కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు అర్హులు అందరికీ అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అల్లుడు డాక్టర్ తన్నీరు రంగనాథ్ కోరారు. ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు కుమార్తెలు సింహాద్రి నిశ్చల, డాక్టర్ సహజ, అల్లుడు డాక్టర్ రంగనాథ్ స్థానిక నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కోవిడ్ సమయంలో మల్లంపల్లి గ్రామానికి చెందిన 22 మంది కరోనా బారిన పడగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రతి ఒక్కరినీ పలకరించి ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. నిత్యం ప్రజలతో ఉండే సింహాద్రి రమేష్ బాబును ఎమ్మెల్యేగా, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని డాక్టర్ రంగనాథ్, డాక్టర్ సహజ, నిశ్చల విజ్ఞప్తి చేశారు. తొలుత మల్లంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ఝాన్సీలక్ష్మి, స్థానిక నేతలు బొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కుంపటి శరత్ బాబు, అంగడాల నాగరాజు, పడమట వీరకుమార్, చింతా రామచంద్రరావు, హరినాథ్, దేవినేని విజయ్‌కుమార్, ఆకురాతి భాస్కరరావు, గొరిపర్తి నాగేశ్వరరావు, భాస్కరరావు, పాండు రంగారావు, వీర్ల రాంబాబు, తాతినేని కృష్ణారావు, కొణతం శ్రీను, డొక్కు మురళి, పులి వెంకటేశ్వరరావు, పిడిగే లైలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాంప్రసాద్ కుమారుడిని.. ఆశీర్వదించండి

పెడనలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేసిన ఉప్పాల రమేష్(రాము)



22వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఉప్పాల రాము, హారిక

పెడన: 'ఉప్పాల రాంప్రసాద్ కుమారుడిని, ఆయన మీకు సుపరిచితులు. నన్ను ఉప్పాల రాము (రమేష్) అంటారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న నన్ను మీ ఓట్లతో ఆశీర్వదించండి' అని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము కోరారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పెడన పట్టణంలోని 20, 21, 22, 23వ వార్డుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి విస్తృతంగా పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. నేతన్న నేస్తం ద్వారా నేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలు అందించి చేనేత కార్మికులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుందని గుర్తుచేశారు. కరోనా ఇబ్బందుల్లో నేతన్నలున్నారని గుర్తించి, రెండో విడత ఆర్థిక సాయాన్ని ముందుగానే అందించారని పేర్కొన్నారు. అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, ఆసరా, పిల్లల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి అమలు చేసి ఆర్థిక భరోసా ఇచ్చిన ప్రభుత్వానికి అండగా ఉందామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని, ఇందు కోసం ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండింటిని ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రచారం ముమ్మరం

భార్యాభర్తలైన ఉప్పాల హారిక, రాము ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తలో వైపు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. బాబాయ్, పిన్ని, తాత, అమ్మమ్మ అంటూ ఆప్యాయంగా పలుకరిస్తూ ఫ్యాన్ గుర్తును మరచిపోవద్దని చెబుతూ ముందుకు సాగారు. వారితో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, పిచ్చిక సతీష్‌బాబు, మెట్ల సుబ్రహ్మణ్యం, ఉమ్మిటి తనూజ, పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, బొడ్డు శ్యామల, నాగమణి, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కోడూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సింహాద్రి వికాస్



చింతలమడ గ్రామస్తులతో కరచాలనం చేస్తున్న వికాస్

కోడూరు: మండల కేంద్రమైన కోడూరులోని ఒకటి, రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు తరఫున ఆయన తనయుడు సింహాద్రి వికాస్ శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకాల సౌకర్యాలు కల్పించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు వేసేందుకు ఇంగ్లిష్ మీడియం విద్యను అమలు చేసి, కార్పొరేట్ తరహాలో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టినట్లు వికాస్ చెప్పారు. కార్పొరేట్ వైద్యాన్ని గ్రామస్థాయిలో అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వీటి చూసి ప్రజల మళ్లీ వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని వికాస్ కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి తన తండ్రిని ఎమ్మెల్యేగా, సింహాద్రి చంద్రశేఖరరావును బందరు ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, నేతలు కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, ఇంకొల్లు మురళీకృష్ణ, బడే నాగరాజు పాల్గొన్నారు.

చింతలమడలో ఆత్మీయ సమావేశం

చల్లపల్లి: మండలంలోని చింతలమడలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవడం ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలులోకి వస్తాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా పాలన సాగిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం



మల్లవోలులో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గూడూరు: రాష్ట్రంలో సంక్షేమ స్వర్ణ యుగానికి నాంది పలికిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం గూడూరు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మల్లవోలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు, పెడన అసెంబ్లీ స్థానాల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. తద్వారా జగనన్న నిలబెట్టిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవడం ద్వారా సంపూర్ణ మద్దతు తెలుపుదామని పిలుపునిచ్చారు. సర్పంచి బొర్రా సాంబశివయ్య, నాయకులు గొరిపర్తి రవికుమార్, మురాల వెంకటప్పయ్య, లుక్కా ఏలేషు, అల్లు నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



27వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న, షేక్ అచ్చేబా, కార్యకర్తలు


మచిలీపట్నం టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ని గెలిపించాలని కోరుతూ పలు డివిజన్లలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి జరిగిన మేలులను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. 27వ డివిజన్‌లో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, 11, 12 డివిజన్లలో పార్టీ నాయకులు గూడవల్లి నాగరాజు, బందెల థామస్‌నోబుల్, 29వ డివిజన్‌లో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్, 39వ డివిజన్‌లో కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, 46వ డివిజన్‌లో కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మూడో డివిజన్‌లో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓట్లు అభ్యర్థించారు.

మండు వేసవిలో జలకళ

- నిండుకుండలా తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్
- 15 రోజుల క్రితం 2.38 మీటర్ల వద్ద నీటి మట్టం
- నేడు 5.50 మీటర్ల మేర చేరిన నీటి నిల్వలు



నాడు: తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో 2.38 మీటర్లకి పడి పోయిన నీటి నిల్వలు



నేడు : సామర్థ్యానికి మించిన నిల్వలతో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు చర్యలతో నగర ప్రజలకు ఈ వేసవిలో తాగు నీటి కొరతకు చెక్ పడింది. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సామర్థ్యానికి మించిన నిల్వలతో జలకళ సంతరించుకుంది. స్టోరేజ్ ట్యాంక్ సాధారణ నీటిమట్టం 5.19 మీటర్లు. 15 రోజుల క్రితం 2.38 మీటర్లకు నీటి నిల్వలు పడిపోయాయి. దీంతో నగర ప్రజలకు రెండు రోజులకోసారి నీరు సరఫరా చేశారు. 15 రోజుల క్రితం ఈస్ట్ రైవస్ కాలువ ద్వారా నీరు రావటంతో నగర పాలక సంస్థ ఇంజినీర్లు ఆయిల్ ఇంజిన్లు, విద్యుత్ మోటార్ల సాయంతో ట్యాంక్‌ను నింపారు. ట్యాంక్‌లోకి సామర్థ్యాన్ని మించి 5.50 మీటర్ల మేర నీటి నిల్వలు చేరాయి. ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా సమయంలో బందరు నగర పాలక సంస్థ పరిధిలో 22 మిలియన్ లీటర్లు, పెడన మునిసిపాలిటీకి 12 మిలియన్ లీటర్లు, మచిలీపట్నం మండలంలోని దాదాపు110 గ్రా మాలు, శివారు ప్రాంతాలకు 8 మిలియన్ లీట ర్ల మేర మొత్తం 42 మిలియన్ లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. ఒక్క రోజు తాగునీటి సరఫరాకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఏడు సెంటీ మీటర్ల మేర నీటి నిల్వ తగ్గుతుంది. ట్యాంక్ నింపే పనులను మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్. బాపిరాజు నేతృత్వంలో ఎంఈ సాంబశివరావు, డీఈ వరప్రసాద్, ఏఈ సాయి ప్రసాద్ పర్యవేక్షించారు.

నీటి నిల్వలు తగ్గకుండా చర్యలకు ప్రణాళిక

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో వచ్చే వేసవిలో తాగునీటి నిల్వలు తగ్గకుండా ఉండేందుకు మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఇంజినీర్లతో కలసి ప్రణాళికను సిద్ధం చేశారు. ట్యాంక్ వద్ద మరో 300 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, రూ.60 లక్షలతో రెండు 150 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటి ఏర్పాటుతో కాలువలో ఎప్పుడు నీరు వచ్చినా ట్యాంక్‌ను నింపేందుకు వీలు కలుగుతుంది. దీంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీటి నిల్వలకు కొదవ లేకుండాపోతుంది.